
15న హస్తినకు ముఖ్యమంత్రి

బిహార్ రాష్ట్ర ఎన్నికల ప్రక్రియ నవంబరు రెండోవారంలోగా ముగుస్తాయి. 14న ఫలితాలు వెలువడతాయి. మరుసటి రోజునే సీఎం సిద్దరామయ్య ఢిల్లీ వెళ్ళే షెడ్యూలు ఖరారైంది. ఏకంగా మూడు రోజులు అక్కడే ఉంటారని పార్టీలో చర్చలు సాగుతున్నాయి. ఇదే విషయమై ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా నవంబరులో క్యాబినెట్‌లో మార్పులు ఉంటాయన్నారు. దీనిని బట్టి కేవలం మంత్రులు మాత్రమే మారుతారా.. లేక ఏకంగా నాయకత్వానికి మార్పు చేస్తారా అనేది కీలకం కానుంది. అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే..!



ప్రక్షాళన..!



- రాష్ట్రంలోనూ గుజరాత్ మోడల్ సర్జరీ..!
- పూర్తి మంత్రివర్గ మార్పునకు ప్రయత్నాలు
- బిహార్ పోల్‌కు ముందే వేడెక్కిన రాజకీయం
- ఢిల్లీ వెళ్లిన డీసీఎం..15న హస్తినకు సీఎం

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ మార్పులు చేర్పులు అనేవి సహజంగా జరిగే ప్రక్రియ. ప్రభుత్వం ఏదైనా కొన్ని కారణాలతో మంత్రి పదవులను కోల్పోయినా, కేసులు, ఆరోపణలు వచ్చినవేళ తొలగింపులు జరుగుతాయి. అలా ఖాళీగా ఏర్పడిన స్థానాలకు ముఖ్యమంత్రి సీనియారిటీ లేదా కులాలు, జిల్లాలకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో కొత్తవారికి అవకాశం ఇస్తారు. ఇది ఏ రాష్ట్రంలోనైనా జరిగే ప్రక్రియ. కానీ కొన్నేళ్లకాలంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలను పరిశీలిస్తే ఎక్కడాలేని విధంగా గుజరాత్ ఓ మోడల్ సర్జరీని అమలు చేసింది. ఏకంగా మంత్రులందరిచేత ముఖ్యమంత్రి రాజీనామా చేయించారు. కొన్ని గంటల వ్యవధిలోనే రాజ్‌భవన్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి వాటన్నింటికీ ఆమోదం పొందడంతోపాటు మరుసటిరోజే కొత్తవారిచేత ప్రమాణస్వీకారం చేయించారు. బహుశా గుజరాత్‌లో జరిగిన తరహాలో ఇతర ఏ రాష్ట్రాలలోనూ కేబినెట్ సంపూర్ణ ప్రక్షాళన జరగలేదు. అందుకు పలు కారణాలు ఉన్నాయి. ప్రాంతీయ పార్టీలు ప్రభుత్వాన్ని నడిపే రాష్ట్రాలలో ముఖ్యమంత్రి పదవిలో ఉండేవారే కీలకనేతగా పార్టీలోనూ కొనసాగుతారు. దీంతో ముఖ్యమంత్రి మార్పు అనేది అవకాశం ఉండదు. ఇక జాతీయ పార్టీలు అవసరాలకు లేదా బలమైన ఆరోపణలు అవినీతిలో చిక్కుకుపోతే ముఖ్యమంత్రి మార్పు ఉంటుంది. సీఎం మార్పు జరిగినా క్యాబినెట్‌లో ఉండే వారిలో సుమారు 50-70శాతం మందికి తిరిగి హోదాలు కల్పిస్తారు. లేనిపక్షంలో కొత్తగా వచ్చే ముఖ్యమంత్రికి ఎదురుదెబ్బ తగులవచ్చునని లేదా ఇతర పార్టీలవైపు మొగ్గుచూపితే మొదటికే మోసం వస్తుందనే భయం కూడా ఉంటుంది

ఢిల్లీ చేరుకున్న డీసీఎం డీకే

తాజా రాజకీయ పరిణామాలతో డీసీఎం డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్ళడం సంచలనంగా మారింది. ఇటీవల ఎమ్మెల్సీ యతీంద్ర సీఎం సిద్దరామయ్య వారసుడు సీనియర్ మంత్రి సతీష్ జార్కిహోళి అనడం పెనుదుమారమే లేపింది. ఆ తర్వాత యతీంద్ర వ్యాఖ్యలకు పలువురు ఏకీభవించగా డీకే వర్గీయులు మాత్రం పిల్లచేష్టలంటూ కొట్టిపారేశారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, రణదీప్ సింగ్ సుర్జేవాలాలను కలిసి చర్చలు జరపాలనే ఉద్దేశ్యంతోనే డీకే శివకుమార్ వెళ్ళినట్లు ఆయన వర్గీయులు అభిప్రాయపడుతున్నారు. కానీ బిహార్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నందున ఎవరితో చర్చలు జరుపుతారనేది కీలకం కానుంది. ఇలా సాగుతుండగానే రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ అధిష్ఠానం పెద్దలు సూచిస్తే మంత్రి పదవి వదులుకునేందుకు సిద్ధమన్నారు. ప్రస్తుతం క్యాబినెట్‌లో కీలక మంత్రి వ్యాఖ్యలతో ఇతరులు అయోమయంలో పడ్డారు. తాజాగా సోమవారం హోంమంత్రి పరమేశ్వర్ విధానసౌధలో మాట్లాడుతూ డీకే శివకుమార్ సామర్థ్యాన్ని తక్కువ చేయలేమని పార్టీ అధ్యక్షుడిగా ఎంతో సాధించారన్నారు. ఆయన అన్ని పదవులకు అర్హుడే అన్నారు.



అందరిపైనా వేటు తప్పదా..?

కాంగ్రెస్‌లో అధిష్ఠానం ఒకప్పటి తరహాలో కఠినమైన విధానాన్ని కొనసాగించే పరిస్థితి లేదు. కేవలం కొన్ని రాష్ట్రాలలో మాత్రమే ప్రభుత్వం ఉండడం, ఇక లోక్‌సభ ఎన్నికలలో వరుసగా మూడోసారి చిత్తుగా ఓడిపోవడంతో కేంద్రంలో బలం లేకుండా పోయింది. అయితే గడిచిన దశాబ్దంతోపోలిస్తే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ కొంత మెరుగు అవుతున్నట్లు చెప్పవచ్చు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదా దక్కడం కూడా సాధనగానే చెప్పవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతున్న పెద్ద రాష్ట్రాలలో ఒకటైన కర్ణాటక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. 2018లో జేడీఎస్‌తో చేతులు కలిపి వారికి ముఖ్యమంత్రి పదవిని కేటాయించి కేవలం డీసీఎంతోపాటు కొన్ని మంత్రి పదవులతోనే సరిపెట్టుకుంది. 2023లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనూహ్యమైన మెజారిటీ దక్కింది. సీఎం పదవికి సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు పోటీ పడ్డారు. అయితే చివరి క్షణంలో సిద్దరామయ్యకు ముఖ్యమంత్రి పదవి దక్కిన విషయం తెలిసిందే. అయితే సీఎం హోదాకోసం తీవ్రస్థాయిలో పోటీ పడిన డీకే శివకుమార్‌కు అధిష్ఠానం ఏదో హామీ ఇచ్చింది. అయితే అది ఏమిటనేది బహిరంగం చేసేందుకు సిద్ధంగాలేరు. వచ్చే నెల నవంబరుతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు ముగుస్తోంది. నాయకత్వ మార్పు, లేదా మంత్రులను మార్చడమా అనే చర్చ పదిరోజులుగా హల్‌చల్ చేస్తోంది. ఇప్పటికే మంత్రుల మార్పు ఉంటుందని సీఎం సిద్దరామయ్య దిశా నిర్దేశం చేశారు. ఇక పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కూడా సూత్రప్రాయంగా మార్పు ఉంటుందన్నారు. ఇలా అగ్రనేతలు సంకేతాలు ఇచ్చినట్టయ్యింది. రాష్ట్ర క్యాబినెట్ 34 మంది కాగా ఇద్దరు రాజీనామాతో ప్రస్తుతం 32మంది మంత్రులు ఉన్నారు. ఏకంగా ఓ 20మందిని మార్చే అవకాశాలు ఉన్నట్టు చర్చలు సాగుతున్నాయి. అందుకు మంత్రివర్గమా, మరేదైనా మార్పు జరగాలంటే బిహార్ ఎన్నికలు అడ్డు వచ్చాయి. తాజాగా గుజరాత్‌లో మొత్తం మంత్రులందరి చేత రాజీనామాలు చేయించిన విషయం దేశవ్యాప్తంగా రాజకీయాలలో సంచలనమైన అంశంగా మారింది. ఇదే తరహాలోనే కర్ణాటకలోనూ అమలు చేయాలని అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. గుజరాత్ మోడల్‌గా తీసుకోవాలని అప్పుడే న్యాయం జరిగినట్టు అవుతుందని పలువురు ప్రతిపాదిస్తున్నారు. ఇప్పటివరకు ఈ సందేశం రాష్ట్రానికే పరిమితంగా ఉన్నా త్వరలోనే ఢిల్లీకి చేరే అవకాశాలు లేకపోలేదు. నవంబరు 14 తర్వాత ఢిల్లీలో ఈ అంశం తలెత్తే అవకాశం ఉంది. ఏకకాలంలో అందరినీ తొలగించి ఇప్పటికే వరుసగా నాలుగైదు క్యాబినెట్‌లలో కొనసాగినవారిని తప్పించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని ఏళ్ల తరబడి కొందరు మంత్రులుగా కొనసాగుతున్నారని కొత్తవారికి అవకాశం ఎలా సాధ్యమని ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు.

మంత్రివర్గంలో స్థానం కోసం పెరుగుతున్న డిమాండ్

ప్రస్తుతం క్యాబినెట్‌లో ఉండే 10మందికిపైగా మంత్రులు పదేళ్లక్రిందటి మంత్రులుగా చేసి ప్రస్తుతం కూడా వారే ఉన్నారని ఇలా దశాబ్దాలకాలంగా మంత్రులుగానే ఉంటే ఇతరులకు అవకాశం ఎలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు. మంత్రులు అయ్యే అర్హత అందరికీ ఉంటుందని, అందుకు జిల్లాలు, సామాజిక సమీకరణలు మాత్రమే చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. అధికారంలోకి వచ్చిన ప్రతిసారి వారే మంత్రులైతే మేం ఎమ్మెల్యేలుగా కొనసాగేందుకు మాత్రమే ఎందుకు ఉండాలనే ప్రశ్న తీవ్రం అవుతోంది. రెండున్నరేళ్లు మంత్రులుగా ఉన్నారని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. జేడీఎస్‌తో కలసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు, కేవలం మంత్రి పదవులు రాలేదని 14మంది రాజీనామా చేయడంతో ప్రభుత్వమే కూలిందనేది మరవరాదంటున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో మంత్రులు కాలేనివారు, బీజేపీలో మూడున్నరేళ్లపాటు మంత్రులుగా ఉన్నారనే అంశం కూడా తెరపైకి వస్తోంది. ఇలాంటి క్లిష్టమైన అంశాలు చర్చకు వచ్చినప్పుడు కాంగ్రెస్ పెద్దలు కూడా ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోంది. ప్రస్తుతం క్యాబినెట్‌లో ఉండే 10-15 మంది మంత్రులు వారి నియోజకవర్గాలు, జిల్లాలుదాటి రాజకీయాలు చేయడం లేదని, అనుభవం ఉందని గొప్పలు చెప్పుకొంటున్నా రెండేళ్లలో కొందరి మంత్రులు వారిశాఖలలో సాధనలను బహిరంగంగా చెప్పుకోలేదంటున్నారు. మంత్రి పదవి మాకూ ముఖ్యమే. ఎంతకాలమైనా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ 20మంది మంత్రులుగా ఉంటే భవిష్యత్తు ఎలాగనే ప్రశ్న తలెత్తుతోంది. బిహార్‌లో ఇండియా కూటమికి అనుకూలమైతే స్థానిక కాంగ్రెస్ నాయకులు అధిష్ఠానంతో ఎదురేసుకోరాదని భావిస్తారు. కానీ అక్కడ ఏమాత్రం వెనుకబాటు అయినా మరెంతకాలం మౌనం వీడి రచ్చకెక్కేందుకు సై అనేవారు లేకపోలేదు. అదే జరిగితే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అల్లకల్లోలం కారణం కానుంది. డీసీఎం డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలనే తపనతో ఉన్నారు. అధిష్ఠానం పెద్దలు ఏ హామీ ఇచ్చారనేది బిహార్ ఎన్నికల తర్వాత బహిరంగం అయ్యే అవకాశం లేకపోలేదు. ఇదే జరిగితే నవంబరులో రాష్ట్ర రాజకీయాల్లో క్రాంతి కానుంది అనడంలో ఆశ్చర్యం లేదు.

ఎలక్ట్రిక్ బస్సులతోనే సమస్య

- ప్రమాదాలు, బ్రేక్‌డౌన్‌లకు అవే కారణం
- రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి



బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ బస్సులతోనే సమస్య నెలకొందని తరచూ నగరంలో ప్రమాదాలు, బ్రేక్‌డౌన్‌లకు అవే కారణమని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. విధానసౌధలో సోమవారం మీడియాతో మాట్లాడారు. యూపీఏ పాలనలో ఎలక్ట్రికల్ బస్సులకు 80శాతం రాయితీ ఇచ్చి కార్పొరేషన్‌లకు అప్పగించేవారన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను సదరు సంస్థలకే అప్పగించారన్నారు. వారు నియమించినవారే డ్రైవర్లుగా ఉన్నారని, నిర్వహణ లేకపోవడంతో తరచూ బ్రేక్‌డౌన్‌లు అవుతున్నాయన్నారు. ప్రస్తుతం ఎన్‌టీపీసీ 90 బస్సులు, స్విచ్ మొబిలిటీ 300 బస్సులు, టీఎంఎల్ స్మార్ట్‌సిటీ బస్సులు 1031, ఓహెచ్ఎం గ్లోబల్ 251 బస్సులు ఉన్నాయన్నారు. చార్జింగ్‌స్టేషన్‌లు ప్రతిడిపోలోనూ అనుకూలం చేశామన్నారు. అయినా బస్సులలో సాంకేతిక వైఫల్యాలు, బ్యాటరీ సంబంధిత సమస్యలు, ప్రమాదాల సంఖ్య పెరగడం, బస్సుల నిర్వహణా లోపం, అనుభవం లేని డ్రైవర్లు, బస్సులు నిరంతరం జాప్యం, డ్రైవర్ల కొరత, డ్రైవర్ల ఆందోళన వంటివి వెంటాడుతున్నాయన్నారు. గతంలో మాదిరిగా కార్పొరేషన్లకు బస్సులను పూర్తిస్థాయిలో అప్పగిస్తే పర్యవేక్షణ సముచితంగా ఉంటుందన్నారు. ఇదే విషయమై కేంద్రమంత్రి కుమారస్వామికి ప్రత్యేక లేఖ పంపానన్నారు. బెంగళూరులో అందుబాటులో ఉన్నప్పుడు భేటీ అవుతానన్నారు. ఎలక్ట్రిక్ బస్సు కంపెనీల నిర్వాహకులతోనే పది విడతలకుపైగా ప్రత్యేక సమావేశాలు జరిపామని, అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

పర్యాటక కేంద్రంగా గుర్తించారు.. పనులు చేయకుండా వదిలేశారు..

- కెంచనగుడ్డ అభివృద్ధిపై దృష్టి సారించని అధికారులు

9

హరోం.. హర

- కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా మార్మోగిన ఓంకారనాదం
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



దీపాలు వెలిగిస్తున్న భక్తులు



అలంకరణలో హంపి విరూపాక్షేశ్వరుడు

సోమేశ్వర ఆలయంలో

చింతామణి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కురుబూరు గ్రామంలోని సోమేశ్వర ఆలయంలో కార్తీక మాసం సోమవారం పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు హరివింద్రస్వామి దీక్షిత్ నేతృత్వంలో పూజాకైంకర్యాలు కొనసాగాయి. అభిషేకం అనంతరం స్వామివారికి రజతకవచధారణ చేశారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



అలంకరణలో ముక్తినాథేశ్వరుడు



సోమేశ్వరుడు

కంప్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం పురస్కరించుకుని ఓంకారనాదం మార్మోగింది. శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి జలాభిషేకం, అమృతాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ కార్తీక్ జ్యోతులు వెలిగిస్తూ కార్తీక మాసం మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో ముక్తినాథేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంపిలో విరుపాక్షేశ్వరుడికి ప్రత్యేకాలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు.



షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

ఒలింపిక్స్‌లోనూ పతకాలు సాధించాలి

- క్రీడాకారులకు సీఎం సిద్దరామయ్య పిలుపు
- ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ముఖ్యమంత్రి

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఒలింపిక్స్‌లోనూ పతకాలు సాధించాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. మంగళూరులో న్యూ ఉర్వా స్టేడియంలో చీఫ్ మినిస్టర్ మంగళూరు ఇంటర్నేషనల్ చాలెంజ్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం సాయంత్రం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రకాశ్ పదుకొనె, పుల్లెల గోపీచంద్, సైనా నెహ్వాల్, పీవీ సింధులు భారతీయ బ్యాడ్మింటన్‌ను అంతర్జాతీయస్థాయిలో కీర్తి పతాకం ఎగురవేశారన్నారు. మన దేశ జనాభా అధికమని అయితే ఆ స్థాయిలో క్రీడల్లో పతకాలు రావడం లేదన్నారు. ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్‌తోపాటు అంతర్జాతీయ క్రీడా పోటీలలో విజేతలకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక ఏ గ్రూప్ ఉద్యోగాలను కల్పిస్తోందన్నారు. డీఎస్పీతోపాటు పోలీసు హోదాలలో 2శాతం నుంచి 3శాతానికి స్పోర్ట్స్ కోటా పెంచామన్నారు. ఒలింపిక్స్‌లో బంగారుపతకం సాధిస్తే రూ.5కోట్లు బహుమతి ఇస్తామని ప్రకటించామన్నారు. రూ.38కోట్లతో స్టేడియం నిర్మించామని, ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దక్షిణకన్నడ జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి దినేశ్ గుండూరావు, అజయ్‌సింగ్, అశోకపట్టణ, ఐవాన్ డిసౌజాతోపాటు పలువురు పాల్గొన్నారు.



కొత్త టోపీలతో కానిస్టేబుళ్లు

7

పోలీసులకు కొత్త టోపీలు

- విధానసౌధ వద్ద పంపిణీ ప్రారంభించిన అధికారులు
- నేటి నుంచి అన్ని జిల్లాలకు..



పులుల కట్టడికి గజరాజు



- రంగంలోకి కుంకీ ఏనుగులు
- ఇద్దరు రైతుల మృతిపై నిరసన
- మృతదేహాలతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మైసూరు, చామరాజనగర జిల్లాల్లో పులుల దాడుల్లో ఆదివారం ఒకే రోజున ఇద్దరు రైతులు మృతి చెందిన ఘటనలతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇటీవలి కొంతకాలంగా రెండు జిల్లాల పరిధిలో పలు గ్రామాల్లో పులుల దాడితో పశువులు, గొర్రెలను రైతులు కోల్పోయారు. ఇద్దరు రైతులను ఒకేరోజున పులులు దాడి చేసి చంపేయడంతో వివిధ గ్రామాల ప్రజలు ఆదివారం రాత్రి ఆందోళన చేపట్టారు. సోమవారం కూడా మృతదేహాలను రోడ్లపై నిరసన ఉంచి ఆందోళన కొనసాగించారు. స్థానిక అటవీ అధికారులు గ్రామస్తులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గ్రామస్థుల డిమాండ్‌తో నరభక్షక పులిని బంధించాలని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె సూచించారు. ఇందుకు అనుగుణంగా పులి పట్టివేతకు కుంకీ ఏనుగులను రంగంలోకి దించారు. సరగూరు తాలూకా ముళ్యారు గ్రామంలో పులి దాడిలో రైతు రాజశేఖర్ మృతి చెందగా చామరాజనగర్ జిల్లా బండిపుర అభయారణ్య పరిధిలో రైతు శివణ్ణను పులి దాడి చేసి చంపేసింది. పులిని బంధించేందుకు కుంకీ ఏనుగులు భీమ, మహేంద్ర ఏనుగులను రంగంలోకి దించినట్టు అధికారులు తెలిపారు. పులులను కట్టడి చేయాలని రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియాలో పలువురు కోరారు.

మారుతున్న గ్రామీణ రోడ్ల రూపురేఖలు

- ఎమ్మెల్యే పరిటాల సునీత



పూర్తయిన రోడ్డును చూపుతున్న పరిటాల సునీత, మహిళలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువు దీరిన 16నెలల కాలంలోనే నియోజకవర్గంలో గ్రామీణ రోడ్ల రూపురేఖలు మారాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని న్యామద్దల నుంచి చిన్నప్పేట మీదుగా హరియాన్ చెరువు వరకు రూ.2.94కోట్లతో చేపట్టిన తారురోడ్డు పనులను సోమవారం ఆమె పరిశీలించారు. పనుల గురించి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. 3.7కిలోమీటర్ల తారురోడ్డు, సీసీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉండేవన్నారు. అయితే తమ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామీణ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. సీకేపల్లి మండలంలో 1.2 కిలోమీటర్లు బురుజుగుట్టపల్లి వరకు రూ.1.12కోట్లు, వెల్దుర్తి నుంచి ఎర్రోనిపల్లి వరకు 12 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.3.35కోట్లు, ఆమిదాలకుంట నుంచి వెంకటాంపల్లి వరకు 6 కి.మీ. రోడ్డుకు రూ.3.5కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. నాగసముద్రం గ్రామంలోకి బీటీ రోడ్డు 1.41 కోట్లతో పూర్తి చేశామన్నారు. ఏడు గ్రామ పంచాయతీలోని 10 గ్రామాలలో రూ.3.60కోట్లతో సీసీరోడ్లను కూడా పూర్తి చేశామన్నారు. బసంపల్లి, చందమూరు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆమె వెంట బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు, న్యామద్దల కిష్టప్ప, సుబ్బరాయుడు, రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, భార్గవ, ముత్యాలప్ప, రాజు, మురళి, నారాయణ, సురేశ్ పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.29

అనంతపురంరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.29తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1650 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నిబంధనలు గాలికి..!

- ఎరువుల డీలర్ల ఇష్టారాజ్యం
- రసీదులు ఇవ్వకుండా రైతులకు కుచ్చుటోపీ
- ఎమ్మార్పీపై అదనంగా వసూలు
- వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం

అనంతపురం అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాల డీలర్లు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ జేబులు నింపుకుంటున్నారు. నిబంధనల మేరకు దుకాణాల్లో తప్పనిసరిగా ధరల పట్టిక, స్టాక్ వివరాలు ప్రదర్శించాలి. ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ శాతం దుకాణాల్లో ఈ నిబంధనలు అమలు కావడం లేదు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులకు సంబంధించి రసీదులు తప్పని సరిగా ఇవ్వాలి. కొందరు డీలర్లు రసీదులు ఇవ్వకుండా రైతులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. రసీదులు లేకపోవడంతో నాణ్యతలేని విత్తనాలు, పురుగు మందుల ద్వారా పంట సరిగా పండకపోవడం.. పంట నష్టం జరిగిన సమయాల్లో రైతులకు నష్టపరిహారం కోసం ఫిర్యాదు చేసేందుకు అవకాశమే లేకుండా పోతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రైతు ఫిర్యాదుతో బట్టబయలు

ఉమ్మడి జిల్లాలో పలువురు డీలర్లు రైతులకు రసీదులు ఇవ్వడం లేదు. తాజాగా అనంతపురం నగరం ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని శ్రీ సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీ డీలర్‌పై ఓ రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో నిబంధనల అతిక్రమణలు బట్టబయలయ్యాయి. కూడేరు మండలం కమ్మూరుకు చెందిన రైతు లక్ష్మీనారాయణ.. సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీలో దానిమ్మ పంట కోసం అగ్రోమిన్ మ్యాక్స్ 4 కిలోలు, 19-19-19 ఎరువులు 3 కిలోలు కొనుగోలు చేశాడు. అందుకు సంబంధించి రూ.2400 ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఎరువుల కొనుగోలుకు సంబంధించిన బిల్లు ఇవ్వకుండా డీలర్ దురుసుగా ప్రవర్తించాడని, తనకు విక్రయించిన ఎరువుల నాణ్యతను పరీక్షించాలని కలెక్టర్ ఆనంద్‌కు బాధిత రైతు ఇటీవల ఫిర్యాదు చేశాడు. దీన్ని కలెక్టర్ సీరియస్‌గా పరిగణించారు. ఆయన ఆదేశాలతో వ్యవసాయ అధికారులు తనిఖీలు చేశారు. రైతుకు విక్రయించిన ఎరువుల రకాలను సీజ్ చేసి, పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఈ మేరకు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ ఎరువుల కొనుగోలు చేసిన రైతుకు బిల్లు ఎందుకు ఇవ్వలేదన్న అంశంపై సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీ డీలర్‌కు షోకాజు నోటీసు జారీ చేశారు. రైతుకు బిల్లు ఇవ్వని మాట వాస్తవమేనని, భవిష్యత్‌లో ఇలాంటి పొరపాటు చేయకుండా జాగ్రత్త వహిస్తానని సదరు డీలర్ వివరణ ఇచ్చినట్లు సమాచారం.

నాణ్యతలేని విత్తనాలతో నష్టాలు

ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా నాణ్యతలేని విత్తనాలతో పెద్ద సంఖ్యలో రైతులు నష్టపోతున్నారు. నాసిరకం విత్తనాలతో పంట మొలక సరిగా లేకపోవడం.. మధ్యలోనే ఎండిపోవడం.. దిగుబడి సరిగా లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో సదరు డీలర్‌ను సంప్రదించి, వాస్తవ పరిస్థితులను ఆధారాలతో వివరించినా.. విత్తనం సమస్య లేదని, భూమిలోనే ఏదో తేడా ఉందని... ఎలాంటి పురుగు మందులు కొట్టావో నంటూ బుకాయిస్తున్నారు. కొందరు డీలర్లు రసీదులు ఇవ్వకపోవడంపై వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రసీదుతోపాటు తగిన ఆధారాలు చూపించిన రైతుల్లో కొందరికి ఆయా కంపెనీలు నష్టపరిహారాన్ని అందిస్తున్నాయి. ఆధారాలు అన్ని ఉన్నా... మరికొందరికి పరిహారం ఇవ్వకుండా చేతులెత్తేసిన సంఘటనలు ఉన్నాయి. చీనీ, పత్తి పంట సాగు చేసే ప్రాంతాల్లో నిషేధిత గ్లైసెల్ గడ్డి మందును కొందరు డీలర్లు విక్రయిస్తున్నారు. దీనిపై వ్యవసాయశాఖ యంత్రాంగం పట్టించుకోలేదు.

అనుమతులు లేని డిస్ట్రిబ్యూటర్ల నుంచి కొనుగోలు..

విత్తనాలు, పురుగు మందులకు సంబంధించిన కంపెనీలు రాష్ట్రంలో డిస్ట్రిబ్యూటర్లను నియమిస్తాయి. ఆయా డిస్ట్రిబ్యూటర్లకు రాష్ట్ర వ్యవసాయ శాఖ అనుమతులు మంజూరు చేస్తుంది. అనుమతులు కలిగిన డిస్ట్రిబ్యూటర్ల నుంచే డీలర్లు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలి. అందుకు విరుద్ధంగా ఉమ్మడి జిల్లాలోని కొందరు డీలర్లు అనుమతులు లేని డిస్ట్రిబ్యూటర్ల నుంచి విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేస్తున్నారు. వాటని రైతులకు అంటగడుతున్నారు. జిల్లా స్థాయి వ్యవసాయ ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో డీలర్లు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది.

ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు

యూరియా బస్తా ఎమ్మార్పీ రూ.267 ఉంది. కొందరు డీలర్లు ఒక్కో బస్తా రూ.400 నుంచి రూ.450 దాకా విక్రయిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, కదిరి తదితర ప్రాంతాల్లో యూరియాపై అదనంగా వసూలు చేస్తున్నారు. రబీ సీజన్‌లో పంటల సాగులో డీఏపీ ఎక్కువగా వాడుతున్నారు. డీఏపీ బస్తా ఎమ్మార్పీ రూ.1350 ఉంది. డీఏపీ బస్తాకు రూ.1500 నుంచి రూ.1600 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. తాడిపత్రి నియోజకవర్గం, ఇతర మండలాల్లో డీఏపీపై అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. వీటిని నియంత్రించడంలో వ్యవసాయశాఖ విఫలమవుతోంది.

అవగాహన కల్పించడంలో అలసత్వం

డీలర్లు నిబంధనలు అతిక్రయిస్తే రైతులు ఏం చేయాలన్న అంశాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ యంత్రాంగం అలసత్వం వహిస్తోంది. నిబంధనల మేరకు ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు డీలర్ తప్పనిసరిగా బిల్లును (ఫారం-ఎం రూపంలో) ఇవ్వాలి. రసీదులో బ్యాచ్ నెంబర్ నమోదు చేయాలి. రసీదు ఇవ్వకపోతే లైసెన్స్ రద్దు చేయడం, ఇతర చర్యలు తీసుకోవాలి. అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ లైసెన్స్‌ను రద్దు చేయడంతో పాటు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయాలి. బస్తాల తూకం తక్కువ ఉంటే రూ.2వేలు జరిమానా విధించాలి. ఎరువుల నాణ్యత తక్కువగా ఉంటే కేసు నమోదు చేయాలి. ధరల పట్టికలో ధరలు, స్టాక్ వివరాలు నమోదు చేయకుంటే డీలర్‌పై చర్యలు తీసుకోవాలి. నిషేధిత క్రిమిసంహారక మందులు, గడ్డి మందులు విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. విత్తనాల నాణ్యతా లోపంతో పంట సరిగా మొలకెత్తకపోతే వ్యవసాయ అధికారికి రైతులు ఫిర్యాదు చేయొచ్చు. జిల్లా వ్యవసాయ అధికారి ఆ ఫిర్యాదుపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల బృందాన్ని నియమించి, పంటపరిశీలనకు పంపాలి. వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి రైతులు నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. ఈ విషయాలను క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ అధికారులు శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలున్నాయి.



అనంతపురంలోని సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీ దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారి (ఫైల్)

నిబంధనలు అమలు చేయాల్సిందే

ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాల్సిందే. కొనుగోళ్లపై రైతులకు రసీదు ఇవ్వాలి. రసీదు ఇవ్వలేదని రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులను ఎమ్మార్పీకే విక్రయించాలి. ప్రతి దుకాణంలో ధరల పట్టిక, స్టాక్ వివరాలు నమోదు చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

బాబుతోనే దళితుల సంక్షేమం

మడకశిరటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దళితులు, బీసీల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ఎంపీ బీకేపార్థసారథి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లి గ్రామంలో బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నందిగామ నుంచి విప్ తంగిరాల సౌమ్య, రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజ, ఎమ్మెల్సీ గ్రీష్మ, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, నందికొట్కూరు ఎమ్మెల్యే జి.జయసూర్య, సూళ్లూరు పేట ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ బీకేపార్థసారథి మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తొలిగిపోవడం విద్యతోనే సాధ్యమని భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యావ్యవస్థను పటిష్ఠం చేస్తూ ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. చిత్తూరు ఎంపీ ప్రసాద్ మాట్లాడుతూ బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగాన్ని పవిత్రగ్రంథంగా పూజిస్తారని, రాజ్యాంగం వల్లే అందరి తలరాతలు మారాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్‌ల ఆశీస్సుల వల్ల ఎంతో మంది దళితులు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎదగగలిగారన్నారు. రాజ్యాంగం స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దళితుల సంక్షేమానికి వెనకబడిన వర్గాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు.

పారిశ్రామిక రంగం పరుగులు : గుండుమల తిప్పేస్వామి

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవ వల్ల పారిశ్రామికంగా రాష్ట్రం పరుగులు తీస్తోంది. యువతకు ఉపాధి చూపేందుకు వారిద్దరు అహర్నిశలు శ్రమిస్తున్నారు. విశాఖపట్నంలో రూ.15లక్షల కోట్ల పెట్టుబడులతో 15 లక్షల నుంచి 20 లక్షల మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలు నెలకొల్పుతుండటంతో దేశం మొత్తం రాష్ట్రం వైపు చూస్తోంది. బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్‌ల ఆశయ సాధనకు కృషి చేస్తూ, వారి అడుగు జాడల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నడుస్తున్నారు.

డ్రామా మాస్టర్‌ను నమ్మొద్దు: గ్రీష్మ, ఎమ్మెల్సీ

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం చిన్నాభిన్నం అయింది. నా ఎస్సీలు, నా బీసీలు అంటూ జగన్ మరోసారి ప్రజల్లోకి వస్తారు. ఆ డ్రామా మాస్టర్‌ను నమ్మితే మరోమారు రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుంది. 2019 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అప్పటి అధికార పక్షం చేసే దౌర్జన్యాలను అడ్డుకొనేందుకు అనేక పోరాటాలు చేశాం.

చారిత్రాత్మక ఘట్టం : సౌమ్య, ఎమ్మెల్యే

బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరవ్వడం చారిత్రాత్మక ఘట్టం. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఇలాంటి కార్యక్రమం జరిగి ఉండదు.

రాజ్యాంగం రక్షణ కవచం : కుమారరాజా, ఎమ్మెల్యే

వెనకబడిన వర్గాలకు రాజ్యాంగం ఒక రక్షణ కవచం. అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితోనే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతింది. గూగుల్ సెంటర్‌కు, గోలీల సెంటర్‌కు తేడా తెలియని వ్యక్తి జగన్. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం నగరానికి గూగుల్ డేటా సెంటర్‌ను తెచ్చారు.


నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై ఈనెల 28, 29 తేదీల్లో అన్ని మండలాల్లో సర్పంచులు, పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేసినట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ క్రిష్ణతేజ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఇప్పటికే శిక్షణకు సంబంధించి ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

రేపు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు అనుగుణంగా అజెండా అంశాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. అజెండాకు అనుగుణంగా పలు అంశాలపై చర్చ జరిపి తీర్మానాలకు అమోదం తెలుపుతామని అన్నారు. సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు

మొంథా వచ్చేసింది



నాలుగుక్రస్టుగేట్ల ద్వారా నదికి వెలుతున్న వరదనీరు



వేపలపర్తి మార్గాన్ని మూసేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అక్టోబరు 27: కర్ణాటక ప్రాంతం నుంచి బీటీపీ(భైరవానితిప్ప ప్రాజెక్టు)కి వరదనీటి ప్రవాహం పెరుగుతోంది. ఎగువ కర్ణాటక నుంచి వస్తున్న వరద నీటిని అంచనా వేసి దిగువ నదికి నీటిని విడుదల చేస్తున్నారు. ముఖ్యంగా సోమవారం రాత్రికి ఇన్‌ఫ్లో 3750 క్యూసెక్కుల ఉండగా అవుట్‌ఫ్లో 3504 క్యూసెక్కులు ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.72 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా ప్రాజెక్టు నుంచి వేదవతినదికి 3504 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో గుమ్మఘట్ట, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో తొమ్మిది చోట్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు, గోనబావి - వేపలపర్తి, యర్రంపల్లి - గుడిపల్లి, భూపసముద్రం - కన్నెపల్లి, కణేకల్లు మండలంలోని రచ్చుమర్రి - శ్రీరంగాపురం, గంగులాపురం - కోకొర్తి, కణేకల్లు - మాల్యం, బ్రహ్మసముద్రం - బిదురకుంతం, బెణెకల్లు - హోన్నూరు, బొమ్మనహాళ్ మండలంలోని సిద్ధరాంపురం - బొల్లనగుడ్డం గ్రామాల మధ్యలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నదికి అటు ఇటు ఉన్న గ్రామాల రాకపోకలను పూర్తిగా నిషేధించి ఎక్కడికక్కడ పోలీసులు, రెవెన్యూ అధికారులు స్టాపర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి పూర్తిగా రాకపోకలు స్తంభింపజేశారు. వేదావతి, హగరి నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతాలలో సాగుచేసిన పంటలన్నీ నీట మునిగాయి. వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.

అటువైపు వెళ్లొద్దు

భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి నీటిని వదలడంతో మండలంలోని వేదవతి నది పరవళ్లు తొక్కుతోంది. బీటీపీకి పూర్తిస్థాయిలో వరదనీరు చేరడంతో శుక్రవారం రెండు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. నీటి ప్రవాహంతో నది పరివాహకంజలకళ సంతరించుకుంది. హైవేపై నిర్మించిన



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

బ్రిడ్జిని అనుకుని నీరు ప్రవహిస్తుండటంతో గ్రామీణులు తిలకిస్తున్నారు. మండలంలో నరసాపురం, బ్రాహ్మణపల్లి, రమణేపల్లి, గుండ్లపల్లి, శ్రీరంగాపురం, బూదివర్తి గ్రామాల సమీపంలో ఈ నది ప్రవహిస్తుంది. తహసీల్దార్ అనిల్‌కుమార్, వీఆర్వోలు రమేష్‌లు నదిలోకి వెళ్లకూడదంటూ రెండు రోజులు ఈ గ్రామాల్లో దండోరా వేయించారు. గుండ్లపల్లి బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను నిలిపివేసి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

మళ్లీ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

పీఏబీఆర్(పెన్నేహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)లో జలవిద్యుత్ ఉత్పత్తి తిరిగి ప్రారంభించారు. 695 క్యూసెక్కుల నీటితో జల విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా, రెండు గేట్ల ద్వారా 1115 క్యూసెక్కుల నీటిని మిడ్ పెన్నార్ డ్యాంకు వదులుతున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటరమణ సోమవారం తెలిపారు. హంద్రీ-నీవా నుంచి 1000 క్యూసెక్కులు, లింక్ చానల్ నుండి 180 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండటంతో డ్యాంలో నీటి మట్టం పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 5.386 టిఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. హంద్రీనీవా నీటితో పాటు తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల నీరు అధికంగా చేరుతుండటంతో డ్యాంగేట్లు మరిన్ని ఎత్తి నీటిని విడుదల చేస్తామని డీఈఈ వెంకటరమణ, తెలిపారు. డ్యాంలోని నీటిమట్టం, తదితరు అంశాలను ఏఈఈలు లక్ష్మీదేవి, ముత్యాలప్ప, గంగమ్మ, రేణుకు పర్యవేక్షిస్తున్నారన్నారు. కాగా డ్యాంలో రెండుగేట్ల నుంచి నీరు విడుదల చేయడంతో ప్రవాహం ఎక్కువగా ఉందని, నీటిని చూడటానికి గేట్ల వైపు ఎవరు వెళ్లవద్దని డీఈఈ వెంకటరమణ సూచించారు.

సహాయక చర్యలు చేపట్టాలి: కలెక్టర్

మొంథా తుపాన్ నేపథ్యంలో జిల్లాలో కురిసే వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ఆయన జిల్లా అధికారులతో తుపాను సన్నద్ధతపై సమీక్షించి, దిశా నిర్దేశం చేశారు. ఎప్పటికప్పుడు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, వాతావరణ శాఖ వారి హెచ్చరికలు, సూచనల మేరకు ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాపై తుపాను తీవ్ర ప్రభావం లేనప్పటికీ , భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబరు 8500292992కు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పలు శాఖల అధికారులు, సిబ్బంది జిల్లా పంచాయతీ శాఖ, ఏపీఎస్పీడీసీఎల్ తదితర శాఖలు సహాయక చర్యలకు హాజరయ్యేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు సమావేశంలో జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల తదితరులు పాల్గొన్నారు.



పీఏబీఆర్ డ్యాం గేట్లు నుంచి నీటి విడుదల

రైల్వే గేటును ఢీకొట్టిన మినీ బస్సు

ఆపకుండా వెళ్లిపోయిన డ్రైవర్



గేటు విరిగిపోవడంతో ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రైల్వేగేటు

ముదిగుబ్బ, అక్టోబరు, 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరిధి పుట్టపర్తి రోడ్డులోని రైల్వే గేటును మినీ బస్సు ఢీకొట్టి, ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో గేటు విరిగినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధ్యాహ్నం నర్సాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు వస్తున్న సమయంలో గేటు వేస్తుండగా ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి వెళ్లే మినీ బస్సు వచ్చింది. గేటును బలంగా ఢీకొట్టి, డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. అప్రమత్తమైన సిబ్బంది రైలు వచ్చే సమయంలో ప్రత్యామ్నాయ గేట్లను ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను నియంత్రించడంతో ప్రమాదం తప్పింది. సంబంధిత రైల్వే అధికారులు గేటుకు మరమ్మతులు చేపట్టారు. ఈ విషయంపై స్టేషన్ మాస్టర్ శివశంకర్‌ను అడగ్గా.. గేటుకు మరమతులు చేస్తుండగా.. వెల్డింగ్ కట్ అయి గేటు విరిగిపోయిందని చెప్పడం గమనార్హం.

మెగా సప్లిమెంటరీ అవకాశం


అనంతపురంరూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో 2005 నుంచి 2016 మధ్య చదివి, ఫెయిలైన విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సరిత సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి నవంబరు 29వ తేదీ వరకు కళాశాలలో ఫీజు చెల్లించవచ్చన్నారు. వివరాలకు 9676414799 నంబరులో సంప్రదించవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు శాసనసభ కమిటీ రాక

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమానికి సంబంధించిన శాసనసభ కమిటీ మంగళవారం జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ సభ్యులు.. జిల్లా అధికారులతో సమావేశమవుతారన్నారు. ఎస్సీలు, ఆ సంఘాల నాయకులు, ప్రతినిధులు సమస్యలపై వినతి పత్రాలు సమర్పించుకోవచ్చన్నారు. సమవేశంలో శాసనసభ కమిటీ అధ్యక్షుడు కుమార్ రాజావర్ల, సభ్యులు కొండ్రు మురళీమోహన్, కొలికపూడి శ్రీనివాసరావు, తాటిపర్తి చంద్రశేఖర్, దేవీ వరప్రసాద్, బోనెల విజయచంద్ర ఎంఎస్ రాజు, రోషన్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొంటారన్నారు.

ఉద్యమ దీప్తి వీఎన్‌రెడ్డి

- స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం
- ఎన్నోమార్లు జైలుకు సైతం..
- దివికేగిన స్వాతంత్ర్య సమరయోధుడు వీఎన్ రెడ్డి



వీఎన్ రెడ్డి

పావగడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీఎన్‌రెడ్డి దేశ స్వాతంత్ర్యం కోసం విద్యార్థి దశ నుంచే అవిశ్రాంతంగా పోరాడారు. పావగడ, తుమకూరు జిల్లాలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నారు. తెల్లవాళ్లను తరిమికొట్టే ప్రయత్నాల్లో భాగంగా ఎన్నోసార్లు జైలుకు సైతం వెళ్లారు. ఎలుకతోకకు నిప్పంటించి పావగడ తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లను దహనం చేసేందుకు యత్నించిన కేసులో ఆయన జైలుకు వెళ్లడం ఒక ఉదాహరణ. వందేళ్లకుపైబడి జీవించిన ఆయన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కల్లూరి సుబ్బారావు, తరిమెల నాగిరెడ్డి, విద్వాన్‌విశ్వం, ఎఎం లింగణ్ణ, పప్పూరి రామాచారితో కలిసి ఎన్నో ఉద్యమాల్లో తెల్లవారికి వ్యతిరేకంగా పోరాడారు. ఎంతో నిరాడంబర జీవితం గడిపిన వీఎన్‌రెడ్డి సోమవారం ఆయన స్వగ్రామం వెంకటాపురంలో మృతి చెందారు.

చివరి స్వాతంత్ర్య సమరయోధుడు

జలియన్‌వాలాబాగ్ దురంతానికి నిరసనగా కర్ణాటకలోని విదురాశ్వత్థంలో జరిగిన నిరసన కార్యక్రమంలో వీఎన్‌రెడ్డి పాల్గొన్నారు. నిరసనకారులపై బ్రిటిష్ వారు జరిపిన కాల్పుల్లో వీఎన్‌రెడ్డి తృటిలో తప్పించుకున్నారు. తర్వాత కూడా నిర్భయంగా స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సామాజిక స్పృహతో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇంగ్లిష్ అనర్గళంగా మాట్లాడే ఆయన కర్ణాటక రాష్ట్రంలో చిట్టచివరి పెన్షన్ అందుకున్న స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తింపు పొందారు.

జడ్పీటీసీగా సేవలు

1923లో మార్చి 4న వెంకటాపురం గ్రామంలో ఎరుపరెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు జన్మించిన వి.నర్సింహారెడ్డి ఎస్ఎస్ఎల్‌సి వరకు చదువుకున్నారు. స్వాతంత్ర్యానంతరం జడ్పీటీసీగా పని చేసిన ఆయన గ్రామాల రోడ్లకు ఇరువైపులా చింతచెట్లు నాటించారు. తద్వారా పంచాయతీ ఆదాయం పెరగడానికి తోడ్పడ్డారు. చదువుకుంటున్న సమయంలోనే పాఠశాల ప్రార్థన సమయంలో 'అవర్ నోబెల్‌కింగ్ ఎడ్వర్డ్ లాంగ్ లీవ్' అంటూ బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా నినదించారు. వీఎన్‌రెడ్డికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన స్వగ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో మంగళవారం అంత్యక్రియలు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. కాగా గ్రేడ్ టూ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ రాజగోపాల్, అధికార బృందం సోమవారం వెంకటాపురానికి వెళ్లి వీఎన్‌రెడ్డి భౌతికకాయానికి ఘనంగా నివాళులు అర్పించింది.



నివాళులు అర్పిస్తున్న రెవెన్యూ అధికారులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

కొడవటిగంటి (జయంతి)



ప్రముఖ తెలుగు రచయిత 'కొకు'గా పిలవబడే కొడవటిగంటి కుటుంబరావు 1909 అక్టోబరు 28న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. 'చందమామ' మాస పత్రికను తీర్చిదిద్దిన ప్రముఖులలో ఆయన ఒకరు. 50ఏళ్ల రచనా జీవితంలో 10వేల పేజీలకుపైగా రచనలు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాహిత్యం మారాలని అభిప్రాయపడ్డారు. జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలబద్ధలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పనిచేస్తుందనే సిద్ధాంతాన్ని 'బుద్ధి కొలతవాదం' పేరిట ప్రతిపాదించారు. 1980 ఆగస్టు 17న కన్నుమూశారు.

సూర్యకాంతం (జయంతి)



తెలుగు సినీరంగంలో వెండితెరపై 'గయ్యాళి అత్త'కు మారుపేరుగా నిలిచిన సూర్యకాంతం 1924 అక్టోబరు 28న కాకినాడ ప్రాంతం వెంకట కృష్ణరాయపురంలో జన్మించారు. నిజానికి దబాయింపూ, కచ్చితత్వమూ ఉన్న మనిషే అయినా మనసుమాత్రం వెన్న, సున్నితం. 'గుండమ్మ కథ' సినిమాతో ఎంతో పేరొందారు. ఆమె ప్రత్యేకంగా హాస్యం చెయ్యకపోయినా ఆమె సంభాషణ చెప్పేతీరు నవ్వు తెప్పిస్తుంది, చేసే చేష్టలు కోపం తెప్పిస్తాయి. సహజనట కళా శిరోమణి, హాస్యనట శిరోమణి. పద్మావతి మహిళా యూనివర్శిటీచే గౌరవ డాక్టరేట్ ఇతర గౌరవాలు అందుకున్నారు. 1994 డిసెంబరు 17న కన్నుమూశారు.

మైసూరు దొరైస్వామి అయ్యంగార్ (వర్ధంతి)



వీణా విద్వాంసులు, 'పద్మభూషణ్' పురస్కార గ్రహీత దొరైస్వామి అయ్యంగార్ 1920లో బెంగళూరులో జన్మించారు. ఆలిండియా రేడియోలో సంగీత దర్శకుడిగా వ్యవహరించారు. అనేక జుగల్బందీ కచేరీలు ప్రదర్శించారు. కన్నడ కవి పీటీ నరసింహాచార్ రచించిన నాటికలకు సంగీతం సమకూర్చారు. మైసూరు యూనివర్శిటీచే గౌరవ డాక్టరేట్ పొందారు. సంగీత కళానిధి, సంగీత కళాశిఖామణి, చౌడయ్య నేషనల్ మెమోరియల్ అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 1997 అక్టోబరు 28న కన్నుమూశారు.

ఇంద్రానూయి (పుట్టినరోజు)



ఇండియన్-అమెరికన్ మహిళా వాణిజ్యవేత్త, 'పద్మభూషణ్' గ్రహీత ఇంద్రా కృష్ణమూర్తి నూయి 1955 అక్టోబరు 28న చెన్నైలో జన్మించారు. పెప్సికో సంస్థ సీఈఓగా ప్రపంచస్థాయిలో అత్యధిక వేతనం పొందిన మహిళానేతగా గుర్తింపు పొందారు. 12ఏళ్లలో 80శాతం అమ్మకాలు పెంచి సత్తా చాటుకున్నారు. 2008లో ఫోర్బ్స్ జాబితాలో అత్యంత శక్తివంతమైన మహిళల్లో మూడో స్థానంలో నిలిచారు. పలు సంస్థలలో వివిధ హోదాలలో కొనసాగారు. గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2021లో నేషనల్ ఉమెన్స్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నారు. 2022లో గోల్డెన్‌బుక్ అవార్డ్సునుంచి సత్కారం అందుకున్నారు.

బిల్‌గేట్స్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన వ్యాపారవేత్త బిల్‌గేట్స్ 1955 అక్టోబరు 28న వాషింగ్టన్‌లో జన్మించారు. పూర్తిపేరు విలియం హెన్రీగేట్స్-3. సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కంపెనీ సహసంస్థాపకులు, మానవతావాది. కంప్యూటర్లను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన వ్యక్తిగా పేరొందారు. ప్రపంచంలో అత్యంత ధనవంతులలో ఒకరు. బిల్ అండ్ మెలిండాగేట్స్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టుకోసం 2008 జూన్ 28న మైక్రోసాఫ్ట్‌లో తన కార్యకలాపాలకు వీడ్కోలు పలికారు. పలు గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. విద్య, ఆరోగ్యం, పర్యా వరణ రంగాలలో ఆయన సేవలకు 2015లో భారత ప్రభుత్వం నుంచి 'పద్మభూషణ్' పురస్కారం అందుకున్నారు.

బినిం (పుట్టినరోజు)



బాపుగారి ప్రియశిష్యుడు, బినింగా పేరొందిన భమిడిపల్లి నరసింహమూర్తి 1957 అక్టోబరు 28న తూర్పు గోదావరి జిల్లా ఆత్రేయపురంలో జన్మించారు. చిత్రకారుడు, కార్టూనిస్ట్, కవి, కథా రచయిత. నాలుగుసార్లు నంది అవార్డు పొందిన టీవీ రచయిత. కళారత్న బిరుదాంకితుడు. ఎడిటింగ్, డిజైనింగ్, డబ్బింగ్, మాడ్యులేషన్, టీవీ టైటిల్స్ తదితర అన్ని విభాగాల్లో పనిచేశారు. పలు గౌరవాలు అందుకున్నారు. 2023 డిసెంబరులో సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అడ్వైజరీ ప్యానెల్ మెంబర్‌గా నియమితులయ్యారు.

జూలియా రాబర్ట్స్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన నటి, నిర్మాత జూలియా రాబర్ట్స్ 1967 అక్టోబరు 28న జార్జియాలో జన్మించారు. 1990వ దశకంలో అత్యధిక రెమ్యూనరేషన్ పొందిన నటి. హాలీవుడ్‌లో మూడు గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ పొందారు. ఉత్తమనటిగా అకాడమీ అవార్డు గ్రహీత. తన సంపాదనలో యునిసెఫ్‌తోపాటు ఇతర చారిటీ సంస్థలకు ఇచ్చారు. 'రెడ్ ఓం ఫిల్మ్స్' అనే ప్రొడక్షన్ కంపెనీని నిర్వహిస్తున్నారు.

ఎర్రితాతకు ప్రత్యేక పూజలు



బళ్లారిరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు చేలగుర్కి యర్రితాత దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు.

ఎకరాకు రూ.2లక్షల పరిహారం ఇవ్వండి

» రైతు సంఘం డిమాండ్

ముళబాగిలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్, రబీ సీజన్‌లలో వర్షాలతో దెబ్బతిన్న ఉద్యానవన పంటలను సమీక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని, నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.2లక్షల పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని శ్రీనివాస సర్కిల్‌లో దెబ్బతిన్న పంటలతో నిరసన వ్యక్తం చేశారు. ఉద్యానవనశాఖ అధికారి రవికుమార్‌కు వినతిపత్రం అందచేశారు. రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు యలువళ్లి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వాణిజ్య పంటల వేళ తప్పని సరిగా బీమా మొత్తాన్ని చెల్లిస్తారని అయితే అతివృష్టి, అనావృష్టి సమయంలో పంటలు నష్టపోతే మాత్రం బీమా కంపెనీలు కనిపించడం లేదని మండిపడ్డారు. నష్టపోయిన రైతులు ఫోన్ చేస్తే బీమా కంపెనీల ప్రతినిధులు స్పందించడం లేదన్నారు. మళ్లీ ఏడాది తర్వాత పంటల వేళ మాత్రం కనిపిస్తారన్నారు. బీమామొత్తాన్ని లూటీ చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతిలేని నర్సరీలకు కొంతమంది అధికారులు అండగా ఉంటున్నారన్నారు. కొన్నిచోట్ల విత్తనాల నాణ్యత ఉండడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా టమోటా, క్యాప్సికం, ఆలుగడ్డ ఇతరపంటలు దెబ్బతిన్నాయన్నారు.



శ్రీనివాస సర్కిల్‌లో రైతుల నిరసన ఇలా..

నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. వినతిపత్రం స్వీకరించిన అనంతరం ఉద్యానవనశాఖ సీనియర్ సహాయక డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ సీనియర్ అధికారుల ఆదేశాల మేరకు పంటనష్టంపై సమీక్ష సాగుతోందని, త్వరలోనే నివేదిక వస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, రాజేశ్, పారుక్‌పాషా, సునిల్‌కుమార్, బంగారి మంజు తదితరులు పాల్గొన్నారు.

క్వీన్స్ ప్రీమియర్ లీగ్ జెర్సీ ఆవిష్కరణ

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాలు సంయుక్తంగా క్వీన్స్ ప్రీమియర్ లీగ్ (క్యూపీఎల్)కు సంబంధించి ట్రోఫీ, జెర్సీలను లాంఛనంగా ఆవిష్కరించారు. సోమవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో టైటిల్ స్పాన్సర్ కేఎస్ సురేంద్ర, కర్ణాటక ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజు, అథ్లెటిక్ పద్మశ్రీ గ్రహీత అంజుబాబిజార్జ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నవంబరు 11నుంచి 15వరకు కోరమంగల ఇండోర్‌స్టేడియంలో పోటీలు జరుగుతాయని, 10న మారతహళ్లి ఈజోన్‌లో ప్రారంభం జరుగుతుందన్నారు. సినిమా, టెలివిజన్, మీడియా, మోడలింగ్, ఇన్‌ఫ్లుయెన్స్ విభాగాలకు చెందిన మహిళా సెలెబ్రిటీలు పాల్గొంటారన్నారు. మహిళాస్వావలంబనకు సంకేతంగా పోటీలు ఉంటాయని, 12 భిన్నమైన క్రీడల్లో పోటీలు జరుగుతాయన్నారు. అంజుబాబిజార్జ్ మాట్లాడుతూ ఒక మంచి ఆలోచనతో క్రీడలవైపు మహిళలను తీసుకురావడం సంతోషమన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఏదో ఒక క్రీడలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. ట్రోఫీతోపాటు జెర్సీలను లాంఛనంగా ఆవిష్కరించారు.



పద్మశ్రీ గ్రహీత అంజుబాబిజార్జ్ తదితరులు

మంత్రి ప్రియాంక ఖర్గే వ్యాఖ్యలపై అసోం సీఎం ఆగ్రహం

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సెమి కండక్టర్ యూనిట్ వంటి భారీ పరిశ్రమలు స్థాపించేందుకు ఈశాన్య రాష్ట్రాలలో ప్రతిభావంతుల కొరత ఉందనే కర్ణాటక ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంకఖర్గే వ్యాఖ్యలపై అస్సోం సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్సోం ప్రభుత్వం సదరు వ్యాఖ్యను తీవ్రంగా పరిగణిస్తామని, మంత్రిపై కేసు నమోదు చేసేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తున్నామని అస్సోం సీఎం హిమంత్ బిస్వా శర్మ తెలిపారు. అభ్యంతరాల వ్యాఖ్యలను ఖండించిన సీఎం, ప్రియాంకఖర్గే ఓ ఈడియట్ అనేలా మండిపడ్డారు. ఇది అస్సోం యువతను అవమానించినట్టు కాదా... అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎందుకు స్పందించడం లేదన్నారు. కర్ణాటకకు రావాల్సిన పెట్టుబడులు కేంద్రం గుజరాత్, అస్సోంలకు పంపుతోందనే మంత్రి ప్రియాంకఖర్గే ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలపై అస్సోం సీఎం సోమవారం స్పందించారు. అస్సోంలో విద్యావంతులు, సమర్థులైన యువకులు లేరని అర్థమని, ఇది మా యువతకు జరిగిన అవమానం అని, కోర్టులోనూ కేసు వేయాలనే ఆలోచన ఉన్నట్టు వ్యాఖ్యానించారు.

1 నుంచి సహస్ర చండీయాగం

దొమ్మసంద్ర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతిలో భాగంగా బెంగళూరు కగ్గదాసపురలోని హృదయస్పందన సంస్థ ఆధ్వర్యంలో నవంబరు 1నుంచి 9వరకు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. కల్యాణనగర్‌లోని సురభారతి సంస్కృత, కల్చరల్ ఫౌండేషన్‌లో లోకకల్యాణార్థం సహస్రచండీయాగం, మహారుద్రపారాయణ ఉంటుందని సంస్థ ట్రస్టీ సత్యసాయి ప్రసాద్ తెలిపారు. తాలూకాలోని సర్జాపురలో హృదయస్పందన సంస్థలో సోమవారం సహస్రచండీయాగం, మహారుద్రపారాయణకు సంబంధించి కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. 1నుంచి 3వరకు మహారుద్రపారాయణ, యజ్ఞం ఉంటుందన్నారు. ప్రతిరోజూ గురుప్రార్థన, వివిధ దేవతల పూజ, విధి విధానాలు ఉంటాయన్నారు. 4న మహాసంకల్ప, చండీకళశ స్థాపన ప్రారంభమవుతుందని, 9న పూర్ణాహుతితో ముగుస్తుందన్నారు. హృదయస్పందన సంస్థ ట్రస్టీలు సాయిరా హరిశంకర్ మాట్లాడుతూ సురభారతి సంస్థ ముఖ్యులు ఎల్ శ్రీనివాసన్ మార్గదర్శకంలో యజ్ఞం కొనసాగుతుందన్నారు. సమావేశంలో నాగశ్రీ అవసరాల, ఇట్టా రఘునందన, జగదీశ్ కొట్టూర శెట్టి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తాం



విజేతజట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

విజయపుర, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా క్షత్రియ ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని రానున్నరోజుల్లో అన్ని తాలూకా, జిల్లాలనుంచి ఒక జట్టును ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించదలిచామని అక్షతా చారిటబుల్ ట్రస్టు ముఖ్యులు ఎన్ఆర్ఎస్ దేవరాజ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ పీయూ కళాశాల క్రీడామైదానంలో రెండురోజుల క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలైన భీమా జట్టుకు లక్ష రూపాయల నగదు, ట్రోఫీని అందచేసి మాట్లాడారు. రానున్న రోజుల్లో క్రికెట్‌తోపాటు కబడ్డీ వంటి క్రీడాపోటీలు నిర్వహించదలిచినట్టు తెలిపారు. కార్యక్రమానికి సాన్నిధ్యం వహించిన హొసకోటె శివనపురకు చెందిన ప్రణవానందపురి మహాస్వామి మాట్లాడుతూ క్రీడలు కేవలం మనస్సుకు ఆనందం ఇవ్వడం మాత్రమే కాదని ఉత్తమ దేహధారుడ్యం, ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహకరిస్తాయన్నారు. కార్యక్రమంలో బుళ్ళళ్లి ద్రౌపది ఆదిపరాశక్తి మహాసంస్థాన మఠం స్వామిజీ సాయిమంజునాథ్ మహరాజ్, పురసభ అధ్యక్షులు భవ్యమహేశ్, రాష్ట్ర వహ్నికుల క్షత్రియతిగళ సంఘ మంజునాథ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్షలాది అప్పులు... హాసన్ లేడీ టైలర్‌ను

రోడ్డుపై చితకబాదిన మహిళలు

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హాసన్‌కు చెందిన లేడీ టైలర్ హేమావతి పదేళ్లుగా అందరితో నమ్మకంగా ఉన్నారు. విలాసవంతమైన నివాసం, కారు కొనుగోలు చేశారు. కోటి రూపాయల చీటీ వేశానని, అత్యవసరంగా డబ్బులు కావాలని ఒకరికి తెలియకుండా మరొకరి నుంచి లక్షలాది రూపాయలు అప్పుగా తీసుకున్నారు. అయితే ప్రతిసారి వాయిదాలు వేస్తూ డబ్బులు వాపసు చేయకుండా జాప్యం చేశారు. మరికొందరు నమ్మకమైన వారని బంగారాన్ని తాకట్టుపెట్టి హేమావతికి అప్పుగా ఇచ్చారు. ఇలా రూ.45లక్షల దాకా అప్పులు కట్టకుండా దాటవేస్తున్నట్టు తెలుస్తోంది. ఐదు నెలలక్రితం ఆమె ఒక్కసారిగా కనిపించకుండాపోయారు. ఇటీవలే వాపసు వచ్చి కుమార్తెను విదేశాలకు పంపానని, అక్కడ విలాసవంతమైన కారు, బంగళా కొన్నారని, అక్కడికి వెళ్లామన్నారు. బాధిత మహిళలు ఇద్దరు హేమావతి కనిపించగానే రోడ్డుపైనే జట్టుపట్టుకుని చితకబాదారు. ఆమె భర్తను మందలించి కొట్టారు. అంతలోనే పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ తాను ఎవరిదగ్గరా డబ్బులు తీసుకోలేదని, అంత అవసరం నాకు రాలేదని దాటవేశారు. డబ్బులు ఇచ్చినవారు లబోదిబోమంటున్నారు.



మహిళను కొడుతున్న జనం

సంప్రదాయబద్ధంగా పూజలు

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరవ్యాప్తంగా ఛట్ పూజలు సంప్రదాయబద్ధంగా జరిపారు. బిహార్, ఉత్తరప్రదేశ్ వాసులు ఈ పండుగను జరుపుకొనే సంప్రదాయం అనాదిగా వస్తోంది. బెంగళూరులో స్థిరపడిన యూపీ, బిహార్‌లకు చెందినవారు నాలుగురోజులపాటు ఛట్‌పూజలు చేస్తారు. పూజా విధానంలో భాగంగా ఇళ్లంతా శుభ్రం చేసి స్నానమాచరించి వ్రతం చేస్తారు. మట్టిపోయిలో మామిడికట్టెలు ఉపయోగించి బియ్యం, శనగపప్పు, సొరకాయ లేదా అరటికూరతో చేసిన వంటకాన్ని ఆరగిస్తారు. మూడోరోజున సూర్యుడు అస్తమించే సమయంలో నీటిలో నిలబడి చేటలో ప్రసాదాన్ని సమర్పిస్తారు. వ్రతం ముగిశాక బంధుమిత్రులతో కలసి విందు చేస్తారు. ఛట్ పూజలు తెలంగాణ రాష్ట్రంలో జరిగే బతుకమ్మను పోలి ఉంటుందని అయితే కొంత తేడాలు ఉంటాయంటారు. ఆర్‌టీ నగర్‌లోని హెచ్ఎంటీ మైదానంలో సోమవారం సాయంత్రం ఛట్‌పూజలు జరిపారు. మత్తికెరెలోని జేపీ పార్క్, నాగరబావితోపాటు మరిన్నిచోట్ల వేడుకలు జరిపారు.



ఛట్ పూజల్లో పాల్గొన్న మహిళలు

నంది కొండ టిప్పు ప్యాలెస్‌పై లారెన్స్ పేరు

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్లాపుర నగరానికి అనుబంధంగా ఉండే ప్రముఖ పర్యాటకకేంద్రం నందికొండలపైన టిప్పు సుల్తాన్ వేసవి విడిది ప్యాలెస్ ప్రత్యేకమైనది. ప్యాలెస్‌పై అంతర్జాతీయ డాన్ లారెన్స్ బిష్ణోయ్ పేరు రాశారు. ఇది పర్యాటకులకు తీవ్రమైన అసంతృప్తి కలిగింది. లారెన్స్ బిష్ణోయ్ పేరున్నచోట లవ్ సింబల్ కూడా ఉంది. ప్యాలెస్ పురాతత్వశాఖకు చెందినది కాగా స్థానికులు మండిపడ్డారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు వైరల్ కావడంతో నంది కొండల పోలీసులు సోమవారం సంఘటనా స్థలానికి చేరుకుని రాసిన చోట రంగువేసి కనిపించకుండా చేశారు.



టిప్పు ప్యాలెస్‌పై రాతలు (వృత్తంలో..)

మారిన పోలీసు టోపీ



విధానసౌధ వద్ద పాత టోపీలతో కానిస్టేబుళ్లు

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా దశాబ్దాలకాలంగా పోలీస్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లు ఉపయోగిస్తున్న టోపీలలో మార్పు వచ్చింది. ఇటీవల కొత్త టోపీలను హోం మంత్రి పరమేశ్వర్, ముఖ్యమంత్రికి చూపిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త బ్లూ కలర్ టోపీలు అందుబాటులోకి రానున్నాయి. విధాన సౌధలో సోమవారం నుంచి టోపీలు పంపిణీ ప్రారంభించారు. జిల్లాలవారీగా పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య రంగప్రవేశం



నృత్య ప్రదర్శన

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణ నాట్యాలయలో శిక్షణ పొందిన వ్రితి ఉమాశంకరరాజు, ప్రితికా కృష్ణకుమార్‌ల భరతనాట్య రంగ ప్రవేశం ఆకట్టుకుంది. ఆదివారం జయనగర్‌లోని జేఎస్ఎస్ ఆడిటోరియంలో కార్యక్రమం జరిగింది. భానుమతి నృత్యకళా మందిరం డైరెక్టర్ విదూషి శీలా చంద్రశేఖర్, సంగీతనృత్య అకాడమీ చైర్‌పర్సన్ విదూషి శుభా ధనంజయ్‌లతోపాటు నిమ్హాన్స్ వైద్యనిపుణులు డాక్టర్ కేఎస్ ప్రవీణ్, సంహిత అకాడమీ ప్రిన్సిపాల్ కేఎస్ జ్యోతిలు ముఖ్యులుగా పాల్గొన్నారు. వ్రితి ఉమాశంకరరాజు ఐదేళ్ల వయసునుంచి సంగీతం నేర్చుకుంటున్నారు. చారుమతి శ్రీకాంత్ వద్ద తొమ్మిదేళ్లుగా శిక్షణలు పొందారు. సంగీతం, నృత్యం పట్ల ప్రత్యేక అభిరుచితో నేర్చుకున్నారు. ప్రతికా కృష్ణకుమార్ ఆరోఏట నుంచి నృత్యం నేర్చుకోవడం ప్రారంభించారు. గడిచిన తొమ్మిదేళ్లుగా శిక్షణ పొందారు. ప్రితికా పలు సాంస్కృతిక వేదికలపై భరతనాట్యం ప్రదర్శించారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న ప్రితికా కళలపట్ల ప్రత్యేక ఆసక్తితో ఉన్నారు. పలువురు నాట్యరంగ నిపుణులు భరతనాట్యంపట్ల ఆసక్తి కల్గినవారు, వ్రితి, ప్రితికాల బంధుమిత్రులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఫుట్‌పాత్...



ఫుట్‌పాత్ పక్కనే కాలువ

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోజులో 24గంటలు రద్దీ ఉండే ప్రాంతమిది. రైల్వేస్టేషన్, మెట్రో స్టేషన్, సిటీ బస్టాండ్‌తోపాటు కేఎస్ఆర్టీసీ బస్టాండ్‌లకు అనుబంధంగా రాజాజినగర్‌వైపు నుంచి మార్గం ఉంది. వాటాళ్ నాగరాజ్ రోడ్డు మార్గంలో రైల్వే ట్రాక్ ఉండడంతో అండర్‌పాస్ ఏర్పాటు చేశారు. అందులోనే ఫుట్‌పాత్‌ను నిర్మించారు. రెండున్నర అడుగుల మేర నిర్మించిన ఫుట్‌పాత్‌పైన పోలీసులు ట్రాఫిక్ బ్యారికేడ్‌లను ఉంచారు. ఫుట్‌పాత్ సగానికే వదిలేశారు. సుమారు ఆరు అడుగుల దూరం తర్వాత మెట్ల మార్గం ఏర్పాటు చేశారు. ఇంతకూ ఫుట్‌పాత్ అనేది ప్రజలు నడిచి వెళ్లేందుకా... ప్రమాదాలు కొని తెచ్చుకునేందుకా... అనేలా మారింది. ఫుట్‌పాత్ నిర్మాణం నిలిపివేసిన చోటునే మురుగునీరు చేరింది. అది ఎంతలోతు ఉందో అర్థంకాని పరిస్థితి. అసలే రాత్రింబవళ్లు రద్దీగా ఉండే ఈ మార్గంలో నడిచి రావాలంటే ప్రమాదం కొని తెచ్చుకున్నట్టే అనేలా మారింది. కనీస అవగాహన లేకుండానే అర్ధాంతరంగా పనులు నిలిపివేసినట్టుగా ఉందని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా బీబీఎంపీ అధికారులు పర్యవేక్షించి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

మహారాష్ట్ర యువకుడు బీదర్‌లో హత్య

» వివాహేతర సంబంధంతో చితకబాదిన గ్రామస్థులు

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కల్గిన మహారాష్ట్ర యువకుడు బీదర్ జిల్లా చింతాకి గ్రామానికి రాగా స్థానికులు కాళ్ళు, చేతులు కట్టేసి చితకబాదడంతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా గౌనగావ్ గ్రామానికి చెందిని విష్ణు (27) మృతి చెందిన యువకుడు. చింతాకి గ్రామానికి చెందిన పూజతో ఇతడికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఏడాదికి వీరిద్దరిమధ్య వివాహేతర సంబంధం ఉన్నట్టు తెలుస్తోంది. పూజకు ఇప్పటికే వివాహం కాగా ఇటీవలే విష్ణుతో సన్నిహితం పెంచుకున్నారు. విషయం తెలుసుకున్న పూజ బంధువులు విష్ణును గ్రామానికి రప్పించారు. పూజ ఇంటివద్దకు అతడు చేరుకోగానే విద్యుత్‌స్తంభానికి కట్టి చితకబాదారు. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఈనెల 21న సంఘటన చోటు చేసుకుంది. పూజ తండ్రి అశోక్, సోదరుడు గజాననలు కర్రలతో కొడుతున్న దృశ్యాలు వీడియోలు ఉన్నాయి. కాగా విష్ణు తల్లి లక్ష్మి చింతాకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మేరకు పోలీసులు ఇద్దరినీ ఆదివారం అరెస్టు చేశారు. విష్ణుతోపాటు వచ్చిన అతడి ఇద్దరు స్నేహితులు ఏమయ్యారనేది చర్చనీయాంశమైంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	21,297	17,143
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	21,041	14,977
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77




బండరాయిపై కనిపించిన మొసలి

వామ్మో మొసలి

కంప్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కంప్లి కోట తుంగభద్ర నది తీరాన బండరాయిపై సోమవారం మొసలి సంచరించడంతో స్థానికులు బెంబేలెత్తారు. ఒడ్డున ఉన్న ప్రజలు పరుగులు తీశారు. జలాశయం నుంచి భారీ నీరు నదికి రావడంతో నదిపైభాగంలో ఉన్న మొసళ్లు ఎక్కువగా వచ్చాయని మత్స్యకారులు తెలిపారు. మొసలి తిరుగుతున్న ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

చక్రతీర్థ వద్ద రాఫ్టింగ్ బంద్



చక్రతీర్థ వద్ద బందోబస్తులో పోలీసు

బళ్లారి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హంపి సమీపంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో కోదండరామ ఆలయం సమీపంలో చక్రతీర్ద ప్రాంతంలో బోటు ద్వారా చేసే ర్యాఫింగ్ బంద్ చేశారు. తుంగభద్ర నదిలో చక్రతీర్ద లో బోటు ద్వారా పర్యాటకు ర్యాఫింగ్ చేయడం కోసం చాలా మంది ఇష్టపడుతారు. ఇక్కడ నదిలో నీరు విష్ణుచక్రంలా తిరుగుతూ బోటును ముందుకు వెళ్లకుండా చేస్తారు. తుంగభద్ర నదిలో నీటిప్రవాహం ఎక్కువ కావడం వల్ల ఇక్కడ పర్యాటక శాఖ చక్రతీర్ద ప్రాంతంలో ర్యాఫ్టింగ్ నిలిపివేశారు. ఎవరూ నీటిలోకి దిగకుండా పోలీసుల బందోబస్తు పెట్టారు.



సుందరంగా ప్రవహిస్తున్న తుంగభద్రమ్మ



కెంచనగుడ్డపై ఆలయం

పర్యాటక కేంద్రంగా మార్చారు..

బళ్లారి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చుట్టూ పచ్చిక బయల్లు గలగల దూకే జలపాతాలు. చల్లటి వాతావరణం. ఇలాంటి వాతావరణం.. అదీ ఈకాలంలో ఎవ్వరి మనసైనా పులకించక మానదు. ఇలాంటి పర్యాటక కేంద్రం బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకా వద్ద కెంచప్పగుడ్డ ప్రాంతలో ఉంది. ఈ కెంచనగుడ్డ ఏరియాను పూర్వ కుంచనడుడ్డ అనే అధిపతి పాలించేవారు. ఇందుకు సంబంధించి 1708 నాటి శాసనాలు కూడా ఉన్నాయి. అలాగే కొండదిగువను గంగాధర ఆయలం కూడా ఉంది. కొండ పై నుండి గలగలపారే జలపాతం రెండు ఉన్నాయి. కొంద బాగంలో నిండుగా ప్రవహించే తుంగభద్ర నది కూడా ఉంది. ఇలా ఎంతో సుందరంగా ఉన్న ఈ ప్రాంతంను పర్యాటక కేంద్రగా మార్చాటను టూరిజం డిపార్టు మెంట్ భావించింది. ఇందుకు 2024-2029 కాలంలో పనులు పూర్తీ చేసి పర్యాటక కేంద్రగా రూపకల్పన చేయాలని సంకల్పంచింది. ఇందుకు రూ. తొలివిడత కింద రూ.85 లక్షలు నిధులు కూడా ప్రభుత్వం నుంచి మంజూరు చేశారు. ఈ నిధులు సరిపోవన్న ఉద్దేశంతో మరో కోటి రూపాయలు కూడా మంజూరు చేస్తామిన పర్యాటక శాఖ ప్రకటన చేసింది. రూ.85 లక్షలతో ప్రారంభించిన పనులు కూడా మధ్యలో ఆగిపోయాయి. పర్యాటక ప్రదేశంగా రూపకల్పన జరగడం లేదు. పర్యాటక శాఖ అధికారులు, పాలకులు శ్రద్ద చూపి ఇక్కడ పనులు పూర్తీ చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

నియామకాల్లో వయోపరిమితిని సడలించాలి: డీవైఎఫ్ఐ



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న డీవై ఎఫ్ఐ సభ్యులు

బళ్లారి సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నియామకాల్లో కనీసం ఐదు సంవత్సరాలు వయోపరిమితిని సడలించాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ జిల్లాకమిటీ నేతృత్వంలో సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం ముఖ్యమంత్రికి రాసిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా డెమోక్రటిక్ యూత్ ఫెడరుషన్ ఆఫ్ ఇండియా(డీవైఎఫ్ఐ) బళ్లారి జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి మాట్లాడుతూ గతంలో బీజేపీ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీత చేపట్టకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. బీజేపీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా అదే ధోరణి పాటిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు అయినా ఉద్యోగాల భర్తీపై శ్రద్ధ చూపడాన్ని డీవైఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్రంలోని 43విభాగాల్లో 2,76, 386 ఖాళీ పోస్టులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని ప్రాధమిక ,మాధ్యమిక పాఠశాలలు , అక్షరాస్యత విభాగాల్లో 70,727 పోస్టులు, ఉన్నత విద్యాశాఖలో 13,227పోస్టులు, ఆరోగ్యశాఖలో 37,069 పోస్టులు,హోం అడ్మినిస్ట్రేషన్‌లో 26128 పోస్టులు ,పోలీసు శాఖలో 8000 కంటే ఎక్కువ పోస్టులు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు, పోలీసులు ,అనేక ఇతర పోస్టులు భర్తీ కాకపోవడంతో ఉద్యోగార్థులకు నిరాశ చెందుతున్నారని, పోలీసుకానిస్టేబుళ్లతో సహా అన్ని నియామకాలకు వయోపరిమితిని కనీసం 5సంవత్సరాలు సడలించి భర్తీ చేయాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. జిల్లాధ్యక్షుడు ఎర్రిస్వామి, జిల్లాఉపాధ్యక్షుడు బైలా హనుమప్ప, జిల్లా కోశాధికారి బీపీ నవీన్, పరమేశ్, రమేశ్శ్రీనివాస్, శివానంద, రైమాన్ శిరాజ్ తదితరులున్నారు.

అద్దె బైక్‌లను అనుమతించొద్దు: ఆటోవాలాలు

బళ్లారి సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హంపి ప్రాంతంలో ద్విచక్ర వాహనాల అక్రమ అద్దెను నిరిసిస్తూ హంపి, కమలాపూర్ ,కడ్డిరాంపురకు చెందిన ఆటో డ్రైవర్లు సోమవారం సమ్మె చేసి ఆర్టీఓ కార్యాలయం దగ్గర నిరసన తెలిపారు. అసోసియేషన్ హొస్పేట్ తాలూకా కమిటీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్మిక నాయకుడు సంతోష్ కుమార్ తెలిపారు. కమలాపూర్‌లోని ఒక కంపెనీకి బైక్‌లను అద్దెకు తీసుకోవడానికి అనుమతి ఇవ్వబడింది. కానీ ఇటీవల బెంగళూరుకు చెందిన కొన్ని కంపెనీలు ఇక్కడ ఫ్రాంఛైజీ బైక్‌లను అద్దెకు ఇవ్వడానికి అనుమతి ఇచ్చారన్నారు. ఈ కంపెనీలు తమ కడుపు కొడుతున్నాయని వాపోయారు. వీటిని తక్షణమే రద్దు చేయాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.



ఆర్టీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ మహమ్మద్ హారీస్

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి

● అధికారులకు జడ్పీ సీఈఓ హారీస్ సూచన

బళ్లారి సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటక శాసన మండలి నార్త్-ఈస్ట్ టీచర్స్ నియోజకవర్గానికి ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది, అధికారులు ఆశించిన స్థాయిలో రిజిస్ట్రేషన్ జరిగేలా చేసుకోవాలని జిల్లా స్వీప్ కమిటీ ఛైర్మన్ జిల్లాపంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ హారీస్ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కర్ణాటక శాసన మండలి ఈశాన్య ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలు 2026 లోభాగంగా ప్రత్యేక నమోదు ప్రచారం పురోగతిపై చర్చించడానికి బళ్లారి జిల్లా పరిపాలన జిల్లాస్వీప్ కమిటీ సోమవారం నిర్వహించిన సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, వ్యవసాయం, వైద్య కళాశాలలు, సాంకేతిక కళాశాలలు, అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ కళాశాలలో రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచడానికి అధికారులు, నోడల్ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన ఆదేశించారు, అవసరమైతే వారికి ఫిల్లింగ్ పద్దతిపై శిక్షణ ఇవ్వాలన్నారు.భారత ఎన్నికల సంఘం కలబురగి డివిజన్ ప్రాంతీయ ఆదేశాల మేరకు ఓటర్ల నమోదు ప్రక్రియ నవంబర్ 6నాటికి పూర్తి చేయాలి. అధికారులు దీనిని ఏవిధంగానైన నిర్లక్ష్యం చేయరాదు. సంబంధిత అధికారులు పాఠశాల కళాశాల సముదాయాలను స్వయంగా సందర్శించి తనిఖీ చేయాలని అన్నారు.

సమాజాభివృద్ధికి సమష్టిగా పాటుపడదాం

● మాజీ ఎంపీ బుట్టా రేణుక



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

బళ్లారి సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సమాజ పురోభివృద్ధికి సమష్టిగా కలిసి పనిచేద్దామని కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక అన్నారు. ఆదివారం కురివినశెట్టి సమాజం యువవేదిక ఆధ్వర్యంలో రాఘవకళామందిరంలో ఏర్పాటు చేసిన సన్మాన, ప్రతిభాపురస్కార కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యా రాజకీయ వ్యాపార రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం కురువినశెట్టి సమాజం బెంగళూరు కేంద్ర సంస్థకు నూతనంగా ఎన్నికైన పదాధికారులు, డైరెక్టర్లకు ప్రతిభావంత విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రిమల్లికార్జున నాగప్ప, కావేరి హ్యాండ్‌లూమ్ అధ్యక్షులు విరూపాక్షప్ప మాజీ కార్పోరేటర్ సుదాకర్ దేశాయ్, లింగేశ్వర, యువరాజు, శివప్ప, తిప్పేస్వామి,నీలకంఠప్ప, మాచాని వెంకటేశ్, మల్లికార్జున పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రూ. 75 లక్షల వ్యయంతో ప్రభుత్వాస్పత్రి అదనపు గదులు, ఒక అంబులెన్స్‌ను ఎమ్మెల్యే బీఎం నాగరాజు ప్రారంభించారు. సోమవారం తాలుకాలోని సిరిగేరి గ్రామంలో కర్ణాటక అభివృద్ధి నిధుల కింద నిర్మాణం చెందిన గదులను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 అంబులెన్స్ సేవలను సమీప ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందు రోజుల్లో ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరిబసప్ప, గ్యారెంటీ సమితి సభ్యులు నాగరాజు స్వామి, పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీ, గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న ప్రిన్సిపాల్ సురేశ్ పత్తికి

బళ్లారి సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): లోహశాస్త్ర నిపుణులు ఒకేచోట చేరి అపూర్వ సమ్మేళనం జరుపుకోవడం ఆనందదాయకమని విశ్రాంత ప్రిన్సిపల్ సురేశ్‌పత్తికి అన్నారు. సోమవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెటలర్జీకల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో నిర్వహించిన పునర్మిలన 2025వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈరోజు మనందరం కలిసి త్రివేణి సంగమంగా సంబరాలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా ఆనాటి ఉపన్యాసకులు, ప్రిన్సిపాల్‌ను ఘనంగా సత్కరించారు. పాత విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. తదుపరి పాత విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపన్యాసకులు శేషగిరిరావు ,అనంతాచార్, పీరసాబు, బాలక్రిష్ణ, ప్రస్తుత విభాగాధిపతి కలందర్,పాత విద్యార్థులు కార్పోరేటర్ శ్రీనివాస్ మోత్కార్, కళాకారుడు నాగభూషణ్,లక్ష్మన్, గురుశాంత్, రఘు, వర్ధిని, గౌరీశంకర్, శివరాజు, శివకుమార్, సంతోష్, శివలింగప్ప, భాగ్యలక్ష్మీ,దామోదార్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్

550 వినతులు

హోసూరు(కృష్ణగిరి), అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కృష్ణగిరిలో ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అక్టోబర్ 27న జరిగిన గ్రీవెన్స్‌లో 550 వినతులు వచ్చాయి. గృహ రుణం, ఉచిత కుట్టు మిషన్లు, వృద్ధాప్య పించన్, రోడ్డు సౌకర్యాలు, విద్యుత్ కనెక్షన్‌లు తదితర డిమాండ్లపై అర్జీలు అందినట్టు కలెక్టర్ ఎస్.దినేశ్‌కుమార్ తెలిపారు. తదనంతరం కార్మిక సంక్షేమశాఖ సామాజిక భద్రతా పథకం తరఫున జిల్లా కలెక్టర్ కార్మిక సంక్షేమ శాఖలో నమోదు చేసుకున్న నలుగురి నిర్మాణ కార్మికుల వారసులకు విద్య, వివాహ రుణం, కార్మికుల ప్రమాద ఉపశమన రుణాలకు రూ4.80 లక్షల విలువైన చెక్కులను అందచేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సాదనకురళ్, జిల్లా సహాయ కలెక్టర్ గోపు, అభినయ, డిప్యూటీ కలెక్టర్లు, కార్మిక సంక్షేమ సహాయ కమిషనర్లు, మాదేశ్వరన్, రాజశేఖరన్, ఇతర శాఖల ప్రధాన అధికారులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ - ఐదుగురి అరెస్టు

హోసూరు(క్రైం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హోసూరులోని ఒన్నల్‌వాడి ప్రాంతంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురిని అరెస్టు చేశారు. హనుమంత ఆలయం వీధికి చెందిన కార్మికుడు సుబ్రహ్మణి(49), అదే ప్రాంతానికి చెందిన కృష్ణప్ప(65) బంధువులు. ఈనెల 25న సుబ్రహ్మణి ప్రభుత్వ భూమిలో చెత్తను పారవేశాడు. ఈ అంశంపై కృష్ణప్ప కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. ఇది కాస్త వాగ్వాదంగా మారి ఘర్షణగా మారింది. దీంతో సుబ్రహ్మణిపై కృష్ణప్ప, అతని కుమారులు హరీష్‌కుమార్ (36), అశోక్‌కుమార్ (34) కెంపరాజ్(35)లు దాడి చేశారు. సుబ్రహ్మణి ఫిర్యాదు ఆధారంగా హోసూరు టౌన్ పోలీసులు కృష్ణప్పతో పాటు మరో నలుగురిని అరెస్ట్ చేశారు. అదేవిధంగా తనపై దాడి జరిగిందని కృష్ణప్ప కూడా ప్రతి ఫిర్యాదు చేశాడు. దాని ఆధారంగా పోలీసులు సుబ్రహ్మణిని కూడా అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో కార్మికుడి మృతి

హోసూరు(క్రైం), అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): హోసూరులోని బత్తలపల్లిలో విళుపురం జిల్లాకు చెందిన ఏళుమలై (28) దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. తాను నివాసముంటున్న భవనం 3వ అంతస్తునుంచి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఊహించని విధంగా కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హడ్కో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

వార్డు సమస్యలపై సమావేశం

హోసూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లోని 22వవార్డులలో మొదటివిడత ప్రత్యేక సమావేశాలు జరిగాయి. హోసూరు కార్పొరేషన్‌లోని 45 వార్డులలోని ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడానికి ఆ ప్రాంతంలోని స్థానిక కౌన్సిల్ సభ్యుల నాయకత్వంలో ప్రత్యేక సమావేశాలు జరిగాయి. తాగునీరు, మురుగునీరు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సమస్యలకు ప్రజల నుంచి పరిష్కారాలను కోరారు. అదేవిధంగా స్థానిక కౌన్సిల్ సభ్యుడు చెన్నీరప్ప నేతృత్వంలో 37వ వార్డులోని టీవీఎస్ నగర్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో వార్డుప్రజలు పాల్గొని ప్రాథమిక అంశాలపై చర్చించారు. కౌన్సిల్ సభ్యుడు ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. ప్రాథమిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

● లైబ్రరీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పిలుపు



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలో సోమప్ప చెరువుగట్టు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం సదుపాయాలు సద్వినియోగపరచుకోవాలని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. రూ.కోటితో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ.. మొబైల్‌లో కంప్యూటర్ల మోజులో పడి అనారోగ్యపాలు కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. గ్రంథాలయంలో పుస్తకాలను చదివి విద్యావంతులుగా ఎదగాలని తెలిపారు. పది దేవస్థానంతో సమానం ఒక గ్రంథాలయం అన్నారు. సమాజంలో ఆదాయం ఇన్‌కమ్ వుంటేనే వెల్కమ్ వుంటుందన్నారు. కనుక ప్రతి విద్యార్థి పట్టుదల, దీక్షతో ముందుకెళితే సాధించనిది మరేదీ లేదన్నారు. ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు వారి పిల్లల్ని పాఠశాలలు చేర్పి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. పుస్తకాలతో పాటు ప్రతినిత్యం న్యూస్‌పేపర్లు వుండే విషయాలను తిలకించి దేశంలోను, రాష్ట్రం లోను వుండే విషయాలను తెలుసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. రూ.400కోట్లకుపైగా విద్యాభ్యాసానికే నిధులు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గంలో నిరక్షరాస్యతకు చెక్కు పెడదామన్నారు. ప్రతి గ్రామంలో అక్షరాస్యులుగా రూపుదిద్దుతామన్నారు. మరో రూ. ఆరు కోట్లతో సోమప్ప చెరువు పూర్తిగా అభివృద్ధి చేపట్టి పట్టణంలో ఆకట్టుకునేలా చేపడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ అధికారి లక్ష్మీకిరణ్, నరసప్ప, గంగాధర, వీరేష్, పురసభ అధ్యక్షులు బట్టప్రసాద్ స్థాయి సమితి అధ్యక్షులు ఉస్మాన్, హబీబుర్ రెహ్మాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, కురుగోడు పురసభ అధ్యక్షులు శేకన్న, కౌన్సిలర్ సీఆర్ హనుమంతు, చాంద్ బాషా, దిశ సమితి సభ్యులు ఏసీ దానప్ప, లింగప్ప, షణ్ముఖప్ప, నారాయణ, వీరన్న, సిద్దప్ప, ప్రహ్లాదు, వివిధ కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామకథా ప్రవచనం

బళ్లారి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవచనకర్త మొరారి బాపు మంగళవారం నుంచి 30వ తేదీ వరకు రామాయణ రామకథా ప్రవచనం చేపట్టనున్నారు. రామయాత్రలో భాగంగా మొరారి బాపు 411 మంది భక్తులతో కలిసి ప్రవచనం ఇవ్వనున్నట్లు పర్యాటక శాఖ అధికారులు ప్రకటించారు. ముందుగా పంపసరోవర్ వద్ద ఉండే శబరి ఆశ్రమంలో ప్రవచనం ఇస్తారు. తర్వాత అంజనాద్రి సమీపంలోని ఋషిముఖ పర్వతంలో ప్రవచనం ఇవ్వనున్నారు. హంపి సమీపంలోని మాల్యవంత్ పర్వతంలో, పంచవటి నుంచి సీతను అపహరించిన తర్వాత రాముడు సీతను వెతుక్కుంటూ వెళ్లిన మార్గంలో ఈ ఉపన్యాసం జరుగుతుందన్నారు.



మొరారీ బాపు



నీటిలో విరూపాక్షేశ్వరుడి ఆలయ గోపుర ప్రతిబింబం

హంపిలో అబ్బురపరుస్తున్న ప్రతిబింబాలు

కంప్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హంపి పుణ్యక్షేత్రంలో ఆలయాలు మండపాలు ఏకశిలా రథం నవదిబ్బ పుష్కరేణి గజశాల, వర్షపు నీటిలో ప్రతిబింబాలు పూర్తిగా కట్టుకుని పర్యాటకులు ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నాయి. గత రెండు మూడు రోజులుగా కురిసిన వర్షానికి పలు చోట్ల తగ్గు ప్రాంతాల్లో నీరు నిల్వ వుండకపోవడంతో అక్కడ వుండే మండపాలు ఆలయాలు తదితరులు ప్రతిబింబాలు ఆకట్టుకుంటున్నారు. ఈ సోమవారం విరుపాక్షేశ్వర ఆలయ గోపురం నీటిలో ప్రతిబింబరూపం పర్యాటకులని పూర్తిగా ఆకట్టుకుంది. అలాగే ఏకశిలా రథం వద్ద నీటిలో రథాన్ని వీక్షిస్తున్న పర్యాటకులు ప్రతిబింబాలు పూర్తిగా కట్టుకుని ఆనందాన్నిచ్చాయి. వివిధ రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చిన పర్యాటకులుప్రతిది ఆకట్టుకుని పునః వీక్షించేలా ఆకర్షిస్తున్నాయి.



ఏకశిలా రథం పరిసరాల్లో..